సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



దేవా.. దీవించవా..
బ్రహ్మంగారిమఠంలో శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. -6లో..



జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు అరెస్ట్
జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు నిందితులను కడప వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. -6లో..



3 నుంచి నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు
జమ్మలమడుగులోని నారాపురస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. -6లో..

న్యూస్‌రీల్

'సాఫ్ట్‌బాల్' ఆఫీసర్‌గా గంగులయ్య



పులివెందుల టౌన్ : గోవాలో మే 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగే సీనియర్ సాఫ్ట్ బాల్ నేషనల్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్‌కు కడప జిల్లా పులివెందులకు చెందిన సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు గంగులయ్య టెక్నికల్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారని ఫెడరేషన్ కప్ నిర్వాహకులు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉన్నతాధికారులు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర తదితరులు గంగులయ్యను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్: రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగు విస్తీర్ణం పెంచడానికి అన్ని విభాగాల వ్యవసాయ అధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు సూచించారు. శనివారం కడపలోని తన కార్యాలయంలో జిల్లా సిబ్బందితో పంటలసాగుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, వైఎస్సార్ రైతు భరోసా పోర్టల్‌లో ఏప్రిల్ 3వ తేదీ వరకు అర్జీలను నమోదు చేసుకుని గడువులోపు అర్జీలను పరిష్కరించుకోవాలని కోరారు.

పుస్తకాలొచ్చాయ్..


కడప గోడౌన్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు

జిల్లాకు తొలివిడతలో రావాల్సిన పాఠ్యపుస్తకాలు: 8,03,903
ఇప్పటి వరకు వచ్చినవి : 7,38,823
రెండో విడతలో రావాల్సినవి : 7,93,652
మండలాలకు తరలించినవి: 3,111,903



- బడితెరిచిన రోజే పంపిణీకి నిర్ణయం
- మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలింపు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు దారుణంగా ఉండేవి. వసతులు శూన్యం. విద్యార్థులకు సకాలాంలో పాఠ్యపుస్తకాలు అందేవికాదు. వారు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. నాడు- నేడుతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అందంగా తీర్చిదిద్దారు.విద్యాకానుక పేరుతో అన్ని రకాల విద్యాసామగ్రిని అందిస్తూ అండగా నిలుస్తున్నారు. తాజాగా బడితెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరానికి తొలివిడత పాఠ్యపుస్తకాలు వచ్చాయి. 8,03,903 పాఠ్యపుస్తకాలకుగాను ఇప్పటి వరకు 7,38,823 పుస్తకాలు జిల్లా గోడౌన్‌కు చేరాయి. రెండో విడతకు సంబంధించి 7,93,652 పుస్తకాలు రావాల్సి ఉంది. 1, 2 విడతలకు సంబంధించి ఇంకా 8,58,732 పుస్తకాలు రావాల్సి ఉంది. గత ఏడాది విద్యార్థులకు పంపిణీ చేయగా ఇంకా దాదాపుగా 3 లక్షల పుస్తకాలు గోడౌన్‌లో మిగిలాయి. మరో రెండు, మూడు రోజుల్లో రెండో విడత పాఠ్యపుస్తకాలు కూడా జిల్లా కేంద్రంలోని గోడౌన్‌కు రానున్నాయి. ఏది ఏమైనా విద్యా సంవతసరం ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

22 మండలాలకు 3 లక్షలకు పైగా తరలింపు

కడప పుస్తకాల గోడౌన్‌కు చేరిన పాఠ్యపుస్తకాలను మండలాలకు తరలించే కార్యక్రమాన్ని ఇటీవల డీఈఓ రాఘవరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 22 మండలాలకు సంబంధించి 3,11,903 మండల కేంద్రాల్లోని పుస్తకాలను స్టాక్ పాయింట్లకు తరలించారు. మిగతా మండలాలకు కూడా పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుస్తకాలను భద్రపరచాలి



మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు చేరిన పాఠ్యపుస్తకాలను పర్యవేక్షణ కమిటీ వారు జాగ్రత్తగా భద్ర పరచాలి. జగనన్న విద్యాకానుకలో భాగంగా ఇతర వస్తువులు కూడా వచ్చిన తరువాత వాటిని వేరు చేసి, ఒక కిట్టుగా తయారు చేసి పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు అందజేయాలి.
– రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

పూర్తిస్థాయిలో అందజేస్తాం



ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే మండలాలలకు మూడు లక్షలకు పైగా పాఠ్యపుస్తకాలు తరలించాం. విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన వెంటనే విద్యార్థులకు వీటిని పూర్తిస్థాయిలో అందచేస్తాం.
– మార్తల వెంకట కృష్ణారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: రానున్న సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ స్థాయి విద్యాశాఖాధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జరిగిని సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తక్కువ శాతాన్ని చవి చూసిన జిల్లా..వచ్చే మే నెలలో జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తాజాగా వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 46శాతం మొదటి సంవత్సరం,57 శాతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులను సైతం విస్మయానికి గురి చేసిందన్నారు. తక్కువ శాతం ఉత్తీర్ణత రావడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మేనెల 1 వతేదీ నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐఓ, డీవీఈఓ, కస్తూర్బా, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- ఉపాధి హామి పథకం అమలులో పురోగతిని సాధించి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా ఎస్ఎంఎంఎస్ మరియు టైమ్లీ పేమెంట్స్ వంటి ఇతర అంశాల అమలులో జిల్లా గణనీయమైన స్థానంలో ఉందని, ఇంకా మిగిలిన అంశాల్లో పురోగతి సాధించి మొదటి స్థానంలోకి తీసుకు రావాలని సూచించారు. ఉపాధి హామి కూలీలు ఉదయం 6.00 నుంచి 10.00 గంటల వరకు క్షేత్ర స్థాయిలో పనులకు హాజరై క్షేత్ర స్థాయి సిబ్బంది అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టి ఉపాధి హామి కూలీల హాజరును మెరుగు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణరెడ్డి పాల్గొన్నారు.
- నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ మన బడి నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్‌చాంబర్‌లో మన బడి నాడు-నేడు ఫేజ్-2 పనుల పురోగతిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి నాడు-నేడు రెండవ దశలో భాగంగా సుమారు రూ. 290 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 106 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కాలేజీల్లో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అకస్మికంగా పనులను తనిఖీ చేస్తానని, నాణ్యతా లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు.

గడువు పొడిగింపు

వైవీయూ: వైవీయూలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 29 నుంచి మే 8వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె.గంగయ్య తెలిపారు. కోర్సులకు సంబంధించిన వివరాల కోసం డబ్లుడబ్లుడబ్లు. యోగివేమనయూనివర్సిటీ.ఏసీ.ఇన్‌ను సందర్శించాలన్నారు.

మళ్లీ బయటపడిన బోగస్ సర్టిఫికెట్స్


కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో శనివారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ జరిగింది. జోన్-4 పరిధిలోని రాయలసీమ ప్రాంతాల నుంచి అర్హులైన 89 మందికి కౌన్సెలింగ్ చేపట్టారు. ఇందులో భాగంగా వారి దర ఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను పరిశీలించే క్రమంలో మరికొన్ని బోగస్ సర్టిఫికెట్స్ బయటపడినట్లు తెలిసింది. జనవరిలో జరిగిన నియామకాల్లో ఇప్పటికే 16 బోగస్ సర్టిఫికెట్స్ బయట పడిన సంగతి తెలిసిందే. తాజాగా మరికొన్ని బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూడడం గమనార్హం. దీంతో బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని సమాచారం.

కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం..

కాగా ఈ కౌన్సెలింగ్ రోజునే జెడ్పీ సమావేశ మందిరంలో మలేరియా శాఖ జోనల్ స్థాయి అధికారుల అంతర్గత స్థాయి సమావేశం జరిగింది. దీనికి వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి, జోనల్ మలేరియా అధికారి స్థాయిలో మలేరియా హాజరయ్యారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు అసౌకర్యానికి గురయ్యారు. కాగా నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టామని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను క్షణ్ణంగా పరిశీలించామని, ఎలాంటి బోగస్ సర్టిఫికెట్స్ బయట పడలేదన్నారు.

బాలుడిపై కుక్క దాడి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని వెంకటేశ్వర కాలనీకి చెందిన అబ్దుల్ సలీం కుమారుడు అమ్మార్ అమీర్(5)పై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వస్తుండగా కుక్క కరిచింది.

దేవా.. దీవించవా..

- ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు


ఇరుముడి సమర్పిస్తున్న స్వామి మాలధారులు


గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు


సుప్రభాత కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం : 'దేవా.. దీవించవా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు వేడుకున్నారు. బ్రహ్మంగారిమఠంలో శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బ్రహ్మంగారిమఠంలోని విరాట్ నగర్‌లో విజయవాడ వారు ఏర్పాటు చేసిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నిత్య అన్నదాన విశ్వబ్రాహ్మణ సేవా సమాజం వారి కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వర స్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

వైభవంగా నరనంది ఉత్సవం

రాత్రి నరనంది ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నరనంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి బద్వేలు నియోజకవర్గం రామాపురంలోని నీరొద్దుల పాపయ్య కుమార్తె వెంకటమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి మైదుకూరుకు చెందిన రమణయ్య ప్రదర్శించిన గజేంద్రమోక్షం హరికథ అందరినీ అలరించింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులు వెంట్రుకలను ఆశ్రయించి ఉంటాయని ఆర్యోక్తి. అందుకే తమ తలనీలాలను స్వామికి సమర్పించుకుంటే తొలగుతాయని నమ్మకం. అందుకే కొందరు పూర్తిగా, మరి కొందరు మూడు కత్తెరల ద్వారా తలనీలాలు సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన స్వామి మాలధారులు ఇరుముడి సమర్పించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం విశిష్టత

ఎంతటి భక్తుడైనా స్వామి వారికి వాహనుడై తన భక్తిని చాటుకోవడం ఈ ఉత్సవం విశేషం. స్వామికి వాహనుడై మోసే భక్తిభావం చూపిస్తారు. అంతేగాక నంది ధర్మానికి సంకేతంగా, మానవుడు కూడా ధర్మబద్ధుడై తన జీవనం సాగించడానికి ప్రతీకగా జరిగే ఉత్సవం నరనంది ఉత్సవం. నరనంది అనగా ముఖం నరుడిగా, శరీరం నందిగా ఉండటం. నరుడు, నందితో కూడిన స్వరూపం.


నరనంది వాహనోత్సవంలో విహరిస్తున్న స్వామి, అమ్మవారు

భారీ బందోబస్తు

ఆరాధనోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. మైదుకూరు డీఎస్పీ మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో మరో ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు, 64 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 45 మంది మహిళా పోలీసులు, 120 మంది పోలీసులు, 103 మంది హోంగార్డులు మూడు రోజుల పాటు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. కార్యక్రమాలకు ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటసుబ్రమణ్యాచార్యులు ఆధ్వర్యం వహించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

3 నుంచి నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు

జమ్మలమడుగు : జమ్మలమడుగులోని నారాపురస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభమవుతాయని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. మే 3న బుధవారం సాయంత్రం 6 గంటలకు నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. 4న గురువారం ఉదయం 8:45 నుంచి 9:45 మధ్యలో ధ్వజారోహణ, సాయంత్రం పెద్దశేష వాహనం, 5న శుక్రవారం చిన్నశేషవాహనం, సాయంత్రం హంస వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. 9న మంగళవారం ఉదయం, సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేతంగా నారాపురస్వామికి కల్యాణోత్సవం, 10న బుధవారం ఉదయం 9 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. 13న శనివారం సాయంత్రం పుష్పయాగంతో నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

అంజన్నకు బంగారు ఆభరణం బహూకరణ


ఆలయ అధికారికి ఆభరణం అందజేస్తున్న రాజగోపాల్ దంపతులు

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామికి రూ.77,880 విలువ గల బంగారం విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన గుజ్జల రాజగోపాల్ (ఫార్మసిస్ట్), ఆయన సతీమణి పద్మావతి 13 గ్రాముల 960 మిల్లీగ్రాముల రాళ్లు పొదిగిన బంగారు నామాన్ని శనివారం అందజేశారు. అలాగే స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 10.116 అందించారు. ఈ సందర్భంగా వారిచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్టీ అకడమిక్ సెల్ మెంబర్‌పై ఫిర్యాదు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని పాలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28న శుక్రవారం జరిగిన ఎస్‌ఏ2 సాంఘీకశాస్త్రం పరీక్ష తనిఖీ పేరుతో ఎస్సీఈఆర్టీ అకడమిక్ సెల్ మెంబర్ ఎన్వీ గంగరాజు విద్యార్థులను ఇబ్బంది పెడుతూ హెచ్‌ఎంను గదమాయించి ఫొటోలు, వీడియోలు తీసి వివిధ వాట్సాప్ గ్రూపులకు పంపినందుకు గాను అతనిపై చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడంతోపాటు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్టీ అకడమిక్ సెల్‌మెంబర్‌గా పని చేస్తున్న గంగరాజు ప్రస్తుతం అగడూరు జెడ్పీ హైస్కూల్లో పని చేస్తూ డిప్యూటేషన్‌పై ఎస్‌సీఈఆర్టీకి వెళ్లారన్నారు. గంగరాజు గతంలో పాలగిరి ఉన్నత పాఠశాలలో పని చేస్తూ కొన్ని ఆరోపణల రీత్యా సస్పెండ్ అయ్యాడన్నారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా ఆయన ఆ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ పని చేసే ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను గదమాయించి వారిపై తప్పుడు రిపోర్టు చేశారన్నారు. ఆయన తీరుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

త్వరితగతిన నేరాల దర్యాప్తు పూర్తి

కడప అర్బన్ : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జరిగిన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. శనివారం కడప నగరంలోని «పెన్నార్» పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. ఆయా స్టేషన్‌ల ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీగా చర్యలు చేపట్టడంతోపాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. నిషేధిత గుట్కా, దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని వివరించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు నిందితులను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టుబడి పెడితే, రోజూ కమీషన్‌తోపాటు కొన్ని రోజుల తర్వాత రెండింతలు సంపాదించవచ్చని ప్రజలకు కొందరు ఎరవేస్తున్నారు. దీని ద్వారా రోజూ వేలాది రూపాయల ఆదాయం వస్తుందంటూ జీవీ యాప్ ప్రచారానికి పాల్పడుతున్నారు. దీనిపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో చెన్నూరు మండలం రుద్రభారతిపేటకు చెందిన ముద్దల శేఖర్, చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన బుక్కే ప్రతాప్‌నాయక్‌ను అరెస్ట్ చేశారు. ఇంకా దర్యాప్తు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి బెట్టింగ్ యాప్‌లను నమ్మిమోసపోవద్దని చెప్పారు. ప్రజల దగ్గర ఏదైనా సమాచారం వుంటే పోలీసులకు తెలపాలని పేర్కొన్నారు. డయల్ 100కు లేదా జిల్లా పోలీసు కార్యాలయం వాట్సాప్ నంబర్: 91211 00704కు ఫిర్యాదు చేయాలన్నారు. పెట్టుబడుల పేరిట ఆదాయం వస్తుందని నమ్మించే యాప్‌ల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెర్వు ఘాట్ రోడ్డులో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదూహం లభ్యం అయినట్లు సీకె దిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. మృతుడికి సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నట్లు రశీదులను బట్టి గుర్తించామన్నారు. సమాచారం తెలిసిన వారు సీకె దిన్నె ఎస్‌ఐ నంబర్ 91211 00526కు సంప్రదించాలన్నారు.

కుమార్తె కనిపించక.. కానరాని లోకాలకు


మృతి చెందిన ఆదిలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నవమాసాలు మోసి అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె కనిపించక పోవడంతో తల్లడిల్లిన ఆ కన్నతల్లి కానరాని లోకాలకు వెళ్లింది. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కడప నగరం ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన ఆదిలక్ష్మి కుమార్తె గౌతమి ఫెయిల్ అయింది. దీంతో తండ్రి శ్రీరాములు మందలించడంతో కుమార్తె శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఓ వైపు కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోవడం, ఎక్కడ విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని అవమానంగా భావించిన ఆదిలక్ష్మి (35).. కుమార్తెపై దిగులుతో చౌటపల్లె రైల్వే క్రాస్ వద్ద గూడ్స్ రైలు కిందపడి మృతి చెందింది. ఇది స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాలు

కడప అర్బన్ : జిల్లా పోలీసు యంత్రాంగంలో పని చేస్తూ ప్రజలకు సేవలు అందించడంలో కృషి చేసిన మహిళా పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. శనివారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో మహిళా పోలీసులను ప్రశంసించారు. బాల్యవివాహాలు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, మహిళలు, చిన్నపిల్లల పట్ల నేరాల నియంత్రణలో తమ వంతుగా కృషి చేస్తున్న వారిలో 30 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఆరుగురు హోంగార్డులకు శాలువాలను కప్పి సత్కరించారు. కమాండ్ కంట్రోల్ విభాగంలో విధులను నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు, హోంగార్డులకు ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులను అత్యుత్తమంగా నిర్వహిస్తున్న చిన్నచౌక్ హెడ్ కానిస్టేబుల్ పి.వెంకట సుబ్బయ్య (హెచ్‌సి 1500), కడప తాలూకా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.పెంచలయ్య (హెచ్‌సీ 274), కడప ట్రాఫిక్‌లోనూ అత్యుత్తమ విధులను నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ సి.శ్రీనివాసులు, ఏఎస్‌ఐ ఎం.అరుణాచలంలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు యు.వెంకటకుమార్, బి.రాజాప్రభాకర్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శనివారం కడపలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 7న ప్రారంభించిన «జగనన్నే మా భవిష్యత్తు» కార్యక్రమం 29వ తేదీతో పూర్తయ్యిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించారన్నారు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై ప్రజాభిప్రాయాలను తెలుసుకుని వారి మద్దతు నమోదు చేయడం జరిగిందన్నారు. తుది ఫలితాల నివేదికను ప్రస్తుతం వెల్లడిస్తున్నామన్నారు. కడప నగరంలో 1,02,961 కుటుంబాలు ఉండగా, తాము 93032 కుటుంబాలను సందర్శించడం జరిగిందన్నారు. ఇందులో 74,966 మంది తమ ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తూ మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. ఈ ఫలితాల మేరకు తాము 90.36 శాతం కుటుంబాలను సందర్శించగా, 73 శాతం ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపైన నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నారు. ఈ సమావేశంలో జేసీఎస్ జోన్ ఇన్‌చార్జులు మల్లికార్జున, షఫీ, రెడ్డి ప్రసాద్, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్.సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, కె.సూర్యనారాయణరావు, మనోజ్, సాజన్ పాల్గొన్నారు.